క్లుప్తంగా

ముగిసిన వార్షికోత్సవాలు



అగ్ని గుండంలో నడుస్తున్న భక్తులు

తుక్కుగూడ: పుర పరిధిలోని రావిర్యాల శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ సప్తదశ(17వ) వార్షికోత్సవాలు ముగిసాయి. చివరి రోజు శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో భక్తులు నడిచారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బోధ మాధవరెడ్డి, పూజారి చంద్రశేఖర్, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక అభివృద్ధితో ఉపాధి మెరుగు



మాట్లాడుతున్న డాక్టర్ ప్రహ్లాద రామారావు

బడంగ్‌పేట్: శాస్త్ర సాంకేతిక అభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు పెరిగాయని, పరిశోధనల వలన ఇంకా వివిధ రంగాల్లో అవకాశాలు మెరుగు పడతాయని ఇండియన్ మిసైల్ సైంటిస్ట్, కంట్రోలర్, డీఆర్డీఎల్ డైరెక్టర్, పద్మశ్రీ గ్రహీత డాక్టర్ ప్రహ్లాద రామారావు అన్నారు. శుక్రవారం నాదర్‌గుల్ ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే శాస్త్ర సాంకేతిక రంగంలో మనదేశం ముందంజలో ఉందని పేర్కొన్నారు. సామాన్యుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే జాతీయ సైన్స్ దినోత్సవ ముఖ్య ఉద్దేశమని స్పష్టంచేశారు. కార్యక్రమంలో మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ పీవీ ఆర్ కశ్యప్, హెచ్ఓడీ సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ, ప్రొఫెసర్ వర్ధని, డీన్ వేణుగోపాల్‌రావు, ప్రొఫెసర్ ప్రసన్నకుమార్, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో కరాటే పోటీలు



మెడల్స్‌తో విద్యార్థినులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో నిర్భయ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం కరాటే పోటీలను నిర్వహించారు. పోటీల్లో 23 మంది బాలికలు పాల్గొనగా, మొదటి స్థానంలో సాజియా ఎలిమి, ద్వితీయ స్థానంలో సభా తబుసం, తృతీయ స్థానంలో తన్వీర్ ఫాతిమాలు నిలిచారు. పోటీల అనంతరం గెలుపొందిన విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రమావత్ తావురియా నాయక్‌లు పతకాలు అందజేశారు. పాఠశాల స్థాయిలోనే బాలికలకు ప్రభుత్వం కరాటేలో శిక్షణ ఇవ్వడం అభినందనీయమని శిక్షకుడు తెలిపారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన



కళాశాలను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకట్రామ్

పహాడీషరీఫ్: ఈ నెల 5వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జల్‌పల్లి మున్సిపాలిటీ షాహీన్‌నగర్‌లోని ఓ.ఎస్ విద్యాసంస్థ, గ్లోరీ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను కమిషనర్ బి.వెంకట్రామ్ శుక్రవారం పరిశీలించారు. అక్కడి పరిస్థితులు, ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, వెంటిలేషన్, ఫ్యాన్లు, ర్యాంప్ సదుపాయాల గురించి నిర్వాహకులతో చర్చించారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు.

బాలికలకు యుద్ధ విద్యలు అవసరం

కొందుర్గు: విద్యార్థులు చదువుతోపాటు యుద్ధ విద్యల్లో రాణించాలని ఎంఈఓ కిరణ్ కుమార్ రెడ్డి సూచించారు. ఇటీవల ఆదిలాబాద్ నిర్వహించిన కరాటే పోటీల్లో చౌదరిగూడ కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా చిన్నారులను అభినందించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ కిరణ్‌కుమార్ రెడ్డి హాజరై మాట్లాడారు. ముఖ్యంగా బాలికలు యుద్ధ విద్యలో నైపుణ్యం పొందాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాగసుధ, ఉపాధ్యాయులు శోభ, హరిష, లత, అంజలి, అరుణ, ప్రమీల, ప్రశాంతి, అపర్ణ, సుమలత, మాధవి, రజిని పాల్గొన్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు షురూ

- మసీద్‌ల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టిన మున్సిపల్ సిబ్బంది
- సిద్ధమవుతున్న హలీం బట్టీలు



షాహిన్‌నగర్ మసీద్ వద్ద కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు



జల్‌పల్లిలో ఏర్పాటవుతున్న హలీం బట్టీలు

పహాడీషరీఫ్: పవిత్ర రంజాన్ మాసం ఈ నెల 2వ తేదీ నుంచి ప్రారంభం అవుతుండడంతో జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులు ముస్లిం బస్తీలలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. ముఖ్యంగా మసీద్‌లకు వచ్చి పోయే రూట్లలో పారిశుద్ధ్య సమస్య లేకుండా చూస్తున్నారు. అలాగే నీటి సమస్య లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. శుభ్రత కోసం సాధారణ సిబ్బందికి అదనంగా మరి కొందరిని తాత్కాలికంగా విధుల్లోకి తీసుకున్నారు. మసీద్‌లకు వచ్చిపోయే రహదారులలో గోతులు లేకుండా రెండు రోజులుగా మొరం పోసి చదును చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని మసీదుల వద్ద రాత్రిపూట లైటింగ్ సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నారు. వజూ హౌజ్‌ల వద్ద నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే సబితారెడ్డి పర్యవేక్షణలో ఇప్పటికే సమీక్ష చేపట్టి ఒక్కో వార్డుకు రూ.లక్ష నిధులతో రంజాన్ సదుపాయాలు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు నోరూరించే హలీం కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

గట్టి పోలీస్ బందోబస్తు

మసీదుల పరిసరాలలో అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా బాలాపూర్, పహాడీషరీఫ్ పోలీసులు బందోబస్తుపై దృష్టి సారించారు. కొత్తపేట, ఎర్రకుంట, ఉస్మాన్‌నగర్, షాహీన్‌నగర్, వాదే సాల్హెహీన్, వాదే ముస్తఫా, న్యూ బాబానగర్, క్యూబా కాలనీ, పహాడీషరీఫ్, జల్‌పల్లి ప్రాంతాలలోని మసీదుల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఇక సాయంత్రం ఉపవాస దీక్షలు విరమించిన అనంతరం ఇఫ్తార్ సమయంలో రోడ్లపై నిర్వహించే పండ్ల విక్రయ కేంద్రాలతో ట్రాఫిక్‌కు కూడా అంతరాయం కలగకుండా పోలీసులు చిరు వ్యాపారులకు సూచనలు చేశారు.

నియమ నిష్టలతో ఉపవాస దీక్ష

ఇస్లాం నాలుగో మూల స్తంభం ఉపవాసం. నమాజ్ వలే ఉపవాసం కూడా అన్ని యుగాలలో ప్రవక్తలందరిపై విధిగా చేయడం జరిగింది. గతించిపోయిన సమాజాలలో ఉపవాసాలు పాటించేవారు. ఉపవాసాల సంఖ్య వాటిని పాటించే రుతువులు, కాలాలలో తేడా ఉండేది. ప్రతి మతంలో ఉపవాసాన్ని పాటించడాన్ని మనం చూస్తున్నాం. ముస్లిం సమాజం త్రికరణశుద్ధితో ఆచరించే ఆరాధన వ్రతం ఉపవాసం. దీన్ని అరబీ భాషలో సామ్ గాను, వ్యవహారిక ఉర్దూలో రోజాగా పిలుస్తారు. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం 9వ నెల అయిన రంజాన్ మాసంలో ఈ ఆరాధన వ్రతాన్ని పాటిస్తారు. ఇస్లాం ధర్మశాస్త్ర పరిభాషలో సామ్ అంటే ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకు తినడం, తాగడం, మనో వాంఛలకు దూరంగా ఉండడం అని అర్థం.

ఇబ్బంది లేకుండా చూడాలి



రంజాన్ మాసం మాకు ఎంతో పవిత్రం. నియమ నిష్టలతో ఉంటూ ప్రార్థనలు నిర్వహిస్తాం. మసీదుల పరిసరాలలో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా మున్సిపాలిటీ తరఫున సదుపాయాలు కల్పించాలి. ముఖ్యంగా విద్యుత్, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి. వేసవి సమీపిస్తున్నందున తాగునీటి సమస్య లేకుండా చూడాలి.

– షేక్ అఫ్జల్, జల్‌పల్లి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

- సమస్య తలెత్తకుండా మహేశ్వరం మండలానికి రూ.50 లక్షలు
- గ్రామాల్లో రోజువారీగా భగీరథ నీటిని సరఫరా చేయాలి
- అధికారులకు ఎమ్మెల్యే సబితారెడ్డి దిశానిర్దేశం

మహేశ్వరం: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ సమావేశం మందిరంలో తాగునీటి సమస్య, అభివృద్ధి పనులపై ఆర్‌డబ్ల్యూఎస్, తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహేశ్వరం మండలంలో నీటి ఎద్దడి ఏర్పడకుండా కొత్త బోర్లు వేయడం, మోటార్లు బిగించడంతో పాటు మరమ్మతులకు రూ.50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని, మరో రూ.50లక్షల కోసం ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటిని సమయానికి వదలాలని, రాని రోజుల్లో ప్రత్యామ్నాయంగా బోర్ల ద్వారా వచ్చే నీటిని సరఫరా చేయాలని సూచించారు.

అభివృద్ధి పనుల నిధులకు కృషి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులతో పాటు పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధికి కావాల్సిన నిధులు వచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అంతకు ముందు జీపీ కార్యదర్శులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల వేతనాలు, మెయింటెనెన్స్ కోసం తమ సొంత డబ్బును ఖర్చు చేస్తున్నామని, ఇబ్బందికరంగా ఉందని కార్యదర్శులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఆమె.. పెండింగ్ నిధులు విడుదల చేసే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులకు లేఖ రాస్తానని, అవసరమైతే అసెంబ్లీలో చర్చిస్తానని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జగన్మోహన్ రెడ్డి, భగీరథ గ్రిడ్ డీఈ వినయ్, ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ, పంచాయ తీరాజ్ డీఈ అనిల్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, మండల విద్యాధికారి కస్నా నాయక్, ఆర్‌ఐ స్వర్ణకుమారి, విద్యుత్ ఏఈ చక్రపాణి, పీఆర్ ఏఈ రాంప్రసాద్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రఘు, భగీరథ గ్రిడ్ ఏఈ కార్తీక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన



ప్రదర్శనలను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

హుడాకాంప్లెక్స్: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో దాగున్న ప్రతిభను వెలికి తీయవచ్చని త్రివేణి పాఠశాలల చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక సైన్స్ ప్రదర్శనను డా.ఎస్.త్రివిక్రమ్, డా. శ్రీలేఖలతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు వందకు పైగా తయారు చేసిన నమూనాలను తిలకించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సునీల్, ప్రిన్సిపాల్ యోగేశ్వరి, అకాడమిక్ కౌన్సిలర్ అంజుమ్ ఫిర్దోది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ నేతాజీనగర్, శారదానగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ హుడాసాయినగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. 11కేవీ హనుమాన్‌నగర్, సాయినగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. 11కేవీ లక్ష్మీగణపతి ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 12 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ చైతన్యపురి, కమలానగర్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు. 11 పెద్దఅంబర్‌పేట పారిశ్రామిక వాడ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు. 11కేవీ ఎల్‌బీనగర్, సిరీస్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు



క్యాంపు కార్యాలయంలో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) ఎంతో ఉపయోగపడుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం చేవెళ్ల, షాబాద్ మండలాలకు చెందిన 27 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల కోసమే ప్రభుత్వం నిరంతరం పని చేస్తోందని చెప్పారు. అత్యవసర సమయంలో అభాగ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మొత్తం రూ.10.97 లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేసినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, సురేందర్, ఆగిరెడ్డి, వీరేందర్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, పాండు, శ్రీనివాస్‌గౌడ్, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న ఆపరేటర్లు

కేశంపేట: పెండింగ్ జీతాలు చెల్లించాలని మండల, గ్రామ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదని వాపోయారు. గ్రామ పంచాయతీ వెబ్ పోర్టల్, నెలవారీ పనులు, కొత్త అసైన్‌మెంట్, మ్యూటేషన్లు, జనన మరణాల పనులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలలో డాటా ఎంట్రీ పనులు చేయడంలో కీలకంగా ఉన్న తమకు జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తమకు వెంటనే జీతాలు చెల్లించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 3 నుంచి విధులకు దూరంగా ఉంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీఓ కిష్టయ్య, కంప్యూటర్ ఆపరేటర్లు శ్రీకాంత్, మమత తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డిగూడలో పశు వైద్య శిబిరం

షాబాద్: రైతులు వ్యవసాయంతో పాటు పాడి సంపదను వృద్ధి చేసుకోవాలని షాబాద్ పశువైద్యాధికారి స్రవంతి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలతోపాటు సాధారణ చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల కోసం అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తోందని చెప్పారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడిపశువులను పెంచుకోవాలన్నారు. పశుగ్రాసం పెంచి వాటికి ఆహారంగా ఇస్తే పాలశాతం పెరుగుతుందన్నారు. పశువైద్య సిబ్బంది బలరాం, కృష్ణ, సాయి ఉన్నారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం

- ఘనంగా రాజరాజేశ్వర బ్రహ్మోత్సవాలు
- భక్తజన సందోహంతో కిటకిటలాడిన ఆలయం



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

మహేశ్వరం: మహాశివరాత్రిని పురస్కరించుని మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు శుక్రవారం శివపార్వతులకు హారతి, అభిషేకం, కుంకుమార్చన, మంత్రపుష్పం, రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శివగంగ చుట్టూ కొలువైన పదహారు శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి 11 గంటలకు గ్రామం పురవీధుల గుండా శివపార్వతుల విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. అనంతరం వేద పండితులు దేవతామూర్తుల కల్యాణాన్ని ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మహోత్సవానికి రంగారెడ్డి జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ సతీమణి కిచ్చెన్నగారి విజయమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్ దంపతులు స్వామివార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు అర్ధరాత్రి ఆలయ ఆవరణలో కళాకారులు, విద్యార్థులు సమష్టిగా సాంస్కృతిక కార్యక్రమాలు, రంగస్థల నాటకాలు, భక్తి గీతాలతో అలరించారు. ఈ సందర్భంగా జబర్దస్త్ ఫేమ్స్ నూకరాజు, ఫైమా, రేలా రేలా సింగర్స్ స్కిట్లు, డైలాగ్స్, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు భారీ బందోబస్తు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ సతీమణి విజయమ్మ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. రాజరాజేశ్వర ఆలయం జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కుమార్, ఆలయ డైరెక్టర్లు రాకేష్, శంకర్, సువర్ణ, తిరుపతయ్య, నరేష్, సాయిలు, శ్రీశైలం, ఆలయ ఈఓ మురళి కృష్ణ, ఆలయ మాజీ చైర్మన్లు సుధీర్ గౌడ్, యాద య్య, నవీన్, నాగేశ్వర్, కుమార్, ఆలయ మాజీ డైరెక్టర్ చంద్రయ్య ముదిరాజ్, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు ఈశ్వర్ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ సుదర్శన్ యాదవ్, మాజీ సర్పంచ్ ఆనందం, గ్రామ పెద్దలు రఘుపతి, బాలయ్య, ప్రభాక ర్, ఆలయ ఈఓ మురళీ కృష్ణ పాల్గొన్నారు.



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

వెండి పాత్ర బహూకరణ

షాద్‌నగర్: మండల పరిధిలో ఎలికట్ట గ్రామంలో ఉన్న అంబభవానీ మాత దేవాలయానికి మొగిలిగిద్ద గ్రామానికి చెందిన కక్కునూరి వెంకటేశ్‌గుప్తా రూ.3లక్షల విలువ చేసే 2.8 కిలోల వెండి ధార పాత్రను శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ముత్యాల రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

షాబాద్: గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించి మంచి పేరు తీసుకురావాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఆర్ఆర్ మినీ స్టేడియంలో దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి స్మారకార్థం చేవెళ్ల నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మహేష్‌యాదవ్, రమేష్ యాదవ్, ధనుంజయ్, నర్సింహులు, నాయకులు రాజేందర్‌గౌడ్, వెంకట్‌యాదవ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ రథం అందజేత

చేవెళ్ల: మండలంలోని ప్రజలకు మంగలి బాల్‌రాజ్, సినిమా టాకీస్ నారాయణల సహకారంతో వారి కుమారులు యాదగిరి, దామోదర్‌యాదవ్‌లు ఉచిత వైకుంఠ రథాన్ని అందజేశారు. శుక్రవారం మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు ప్రారంభించారు. పేద ప్రజలు, అనాథలకు వారి చివరి క్షణాల్లో అంత్యక్రియలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఈ రథాన్ని అందుబాటులోకి తీసుకు రావటం అభినందనీయన్నారు. మండల నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్

షాద్‌నగర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలని బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల ప్రశాంత్ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ... బీసీల పాలన సమాజానికి ఎంతో అవసరమన్నారు. బీసీల అభివృద్ధిని ప్రోత్సహించే వారికే ఓటు వేయాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నాయన్నారు. ప్రజలు రాజకీయ పార్టీల నేతలు ఇచ్చే హామీలకు మోసపోకుండా వాస్తవానికి దగ్గరగా ఉండే నాయకులను ఎన్నుకోవాలన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బీసీలు రాణించాలంటే అందరూ ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. సమావేశంలో నాయకులు చంద్రశేఖరప్ప, నరేష్, చందులాల్, శివ, శంకర్, రవి, వరప్రసాద్, సురేందర్‌గౌడ్, సాయిలు, వెంకటేష్, భద్రప్ప, శివకుమార్, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

షాబాద్: భగవంతుడు శివుడి రూపంలో భూమిపై అవతరించి స్వర్గాన్ని స్థాపించాడని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వాహకురాలు బీకే లక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్, నాగర్‌గూడలో శివజయంతి సందర్భంగా శాంతి జెండాను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యోగ ద్వారా మానసిక ఒత్తిడికి గురి కాకుండా చేస్తుందన్నారు. ఆత్మ, పరమాత్మ గురించి క్లుప్తంగా వివరించారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. రోజురోజుకూ మానవతా విలువలు తగ్గి దేశంలో అశాంతి నెలకొంటుందన్నారు. పూర్వకాలంలో దేవాలయాలు.. భగవంతుడి ఆరాధనకే కాకుండా న్యాయం చెప్పడం, విద్య తదితర కార్యక్రమాలకు నెలవుగా ఉండి ధర్మ పరిరక్షణ కోసం నిలిచేవన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



శాంతి సందేశం ఇస్తున్న బీకే లక్ష్మి